పేదల ఆరోగ్యానికి సీఎం భరోసా



విద్యార్థికి ట్యాబ్‌ను పంపిణీ చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: పేదల ఆరోగ్యానికి భరోసానిచ్చేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలంలోని గ్రామ సచివాలయంలో నూతన ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు, విద్యార్థులకు ట్యాబ్‌లను బుధవారం పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పేదలకు రూపాయి ఖర్చు లేకుండా అనేక వ్యాధులకు ఆపరేషన్లు, చికిత్సలు అందించడమే లక్ష్యంగా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని చెప్పారు. గతంలో తెల్ల కార్డు ఉన్న వారికే ఆరోగ్యశ్రీ కార్డులను అందించేవారని.. అయితే ప్రస్తుతం దీంతో సంబంధం లేకుండా రూ.ఐదు లక్షల్లోపు ఆదాయం ఉన్న ప్రతి ఒక్కరికీ అందజేస్తున్నామని వెల్లడించారు. రెండో ఏడాదీ ఎనిమిదో క్లాస్ విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులందరూ ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకొని డిజిటల్ విద్యా బోధనలో రాణించాలని పిలుపునిచ్చారు. గతంలో ఎవరికీ సాధ్యం కాని రీతిలో పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రుల్లో వసతులను మెరుగుపర్చిన ఘనత సీఎంకే దక్కుతుందని కొనియాడారు. వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ మండలాధ్యక్షుడు కొణిదెన మోహన్‌నాయుడు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్‌రెడ్డి, కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, ప్రభాకర్‌రెడ్డి, నరసయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్యాబ్‌లు, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డును పంపిణీ చేస్తున్న మంత్రి కాకాణి

మనుబోలు: ప్రతి హామీనీ నెరవేర్చి ప్రజల ముందుకొస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మనుబోలు సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ కార్డులు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిన అనంతరం మంత్రి మాట్లాడారు. ట్యాబ్‌ల కోసం మండలంలో 315 మంది విద్యార్థులకు రూ.1.04 కోట్లను వెచ్చించారని చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.మూడు వేల పింఛన్‌ను అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. వీధి వీధికీ సిమెంట్ రోడ్లు, అవసరమైన ప్రాంతాల్లో సైడ్ డ్రెయిన్లను నిర్మించామని తెలిపారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక మనుబోలు మండలంలో రూ.152 కోట్లతో అభివృద్ధి పనులను చేశామని వెల్లడించారు. సర్వేపల్లి నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకు జరగనంత అభివృద్ధి ఈ ఐదేళ్ల కాలంలో జరిగిందని సగర్వంగా చెప్పుకొంటానన్నారు. తమ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి పనులను చూపి వాటిని తామే చేశామని టీడీపీ నేతలు నిస్సిగ్గుగా చెప్పుకొంటున్నారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఏ మాత్రం లేని పార్టీ టీడీపీ అని ఎద్దేవా చేశారు. తొలుత మనుబోలు బీసీ కాలనీలో నిర్మించిన సైడ్ డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. సర్పంచ్ పద్మమ్మ, ఎంపీపీ వజ్రమ్మ, ఉపాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, తహసీల్దార్ శివకృష్ణయ్య, పార్టీ నేతలు హరగోపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో సమృద్ధిగా ఎరువులు



వరి నాట్లను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మనుబోలు: రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని, ఎక్కడా కొరత లేదని నెల్లూరు జేడీఏ కార్యాలయ ఏడీఏ నర్సోజీరావు, జిల్లా వనరుల కేంద్ర ఏడీఏ లక్ష్మీమాధవి తెలిపారు. మండలంలోని పిడూరు, వెంకన్నపాళెం, కాగితాలపూరు ఆర్బీకేల పరిధిలో వరినాట్లను బుధవారం వ్యవసాయాధికారులు పరిశీలించారు. రైతులకు సూచనలిచ్చారు. టెక్నికల్ ఏఓ శ్రీనివాసరెడ్డి, మనుబోలు వ్యవసాయాధికారి జహీర్, వీఏఏలు తేజస్వి, అమూల్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డు కోదండరామాపురంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనను చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యటించిన సమయంలో సిమెంట్ రోడ్డును నిర్మించాలని స్థానికులు కోరారన్నారు. ఈ క్రమంలో రూ.ఆరు లక్షలను ఎమ్మెల్యే ఇటీవల మంజూరు చేశారని, ఈ నిధులతో సిమెంట్ రోడ్డును నిర్మించనున్నామని చెప్పారు. కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'ఆడుదాం.. ఆంధ్రా'



వెంకటాచలం: మాట్లాడుతున్న వెంకటశేషయ్య



ముత్తుకూరు: బ్రహ్మదేవిలో క్రికెట్ కిట్ పంపిణీ



కోవూరులో..

వెంకటాచలం: ఆడుదాం.. ఆంధ్రాలో భాగంగా వెంకటాచలంలో క్రికెట్, వాలీబాల్ పోటీలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలకు ప్రాధాన్యమిస్తూ ఆడుదాం.. ఆంధ్రా పోటీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని చెప్పారు. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని కోరారు. క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఎంపీడీఓ ముజిన్నీసా, పార్టీ నేతలు చీకుర్తి నరసయ్య, ఇంతియాజ్, తాటిపర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: ఆడుదాం.. ఆంధ్రాలో భాగంగా మండలంలోని దమ్మాయపాళెం, ఎమ్మీపాళెం, ఈపూరు వెంకన్నపాళెం, బ్రహ్మదేవి, ముత్తుకూరు జెడ్పీ హైస్కూళ్లు, గోపాలపురంలోని అదానీ వరల్డ్ స్కూల్లో ఏర్పాటు చేసిన మైదానాల్లో క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో తదితర క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్రీడా కిట్లను ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

కోవూరు: గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడమే ఆడుదాం.. ఆంధ్రా ప్రధాన లక్ష్యమని ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత పేర్కొన్నారు. వేగూరు పంచాయతీలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీలను వారు ప్రారంభించారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సుధాకర్, ఎంపీడీఓ శ్రీహరి, ఎంపీటీసీ సభ్యురాలు రమాదేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవయ్య, ఎంఈఓలు రహీమ్, చెంచులక్ష్మమ్మ, ఫిజికల్ డైరెక్టర్లు రమణయ్య, మధుసూదన్‌రావు, పీఈటీ వెంకటసుబ్బమ్మ, ఈఓపీఆర్డీ నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి దేవస్థానంలో పూజలు



కోవూరు: పట్టణంలోని గాంధీ పార్కు సెంటర్‌లో కొలువైన కామాక్షితాయి మల్లికార్జునస్వామి దేవస్థానంలో విశేష పూజలను బుధవారం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు విశ్వనాథం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఉభయకర్తలుగా కృష్ణచైతన్య, శ్రావణి దంపతులు వ్యవహరించారు. ఈఓ కృష్ణప్రసాద్, చైర్మన్ సురేష్, ధర్మకర్తల మండలి సభ్యులు పాటూరు మోహన్, హనుమారెడ్డి, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

విడవలూరు: ఆప్కాఫ్ చైర్మన్‌గా తన పదవీ కాలాన్ని పొడిగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కొండూరు అనిల్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలను తెలియజేశారు. మత్స్యకారులకు నిరంతరం అందుబాటులో ఉంటానని.. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని చెప్పారు. మంత్రి అప్పలరాజు, కోవూరు, నెల్లూరు నగర ఎమ్మెల్యేలు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గ్రామసభల్లో ఉపాధి కూలీల గుర్తింపు

పొదలకూరు: పంచాయతీల వారీగా గ్రామసభలను నిర్వహించి ఉపాధి హామీ పథకం కూలీలను గుర్తించనున్నామని ఏపీఓ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడారు. రానున్న జనవరి నుంచి ఆధార్‌కార్డు ఆధారంగా కూలీలకు నగదును చెల్లించనున్నామని చెప్పారు. ఇప్పటి వరకు ఆధార్ నమోదు కాకపోయినా.. యాక్టివేషన్లో లేకపోయినా.. బ్యాంక్‌లో ఆధార్ అనుసంధానం కాని కూలీలను గ్రామసభల్లో గుర్తించనున్నామని చెప్పారు. కూలీ పనులకు హాజరయ్యేవారిని గుర్తించడంతో పాటు హాజరు కాని వారి పేర్లను తొలగిస్తామని చెప్పారు. పంచాయతీల వారీగా ఈ నెల 30 వరకు గ్రామసభలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

వెంకటేశ్వరాలయంలో పూజలు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గోవింద నామస్మరణతో దేవస్థానం మార్మోగింది.

పిడతాపోలూరుకు మంత్రి రాక నేడు

ముత్తుకూరు: పిడతాపోలూరు పంచాయతీలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉదయం పర్యటించనున్నారని మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీతో పాటు సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల శంకుస్థాపనల్లో పాల్గొననున్నారని చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా బాబు



పొదలకూరు: కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడిగా పొదలకూరు పట్టణానికి చెందిన బీసీ బాబును నియమిస్తూ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. మాజీ ఎంపీ చింతా మోహన్ అనుచరుడిగా కొనసాగుతూ కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఆయన ఉన్నారు. మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని బాబు పేర్కొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

కోవూరు: స్థానిక థర్మల్ స్టేషన్లో అవసరమైన పనుల దృష్ట్యా గురువారం ఉదయం ఏడు నుంచి పది వరకు విద్యుత్ సరఫరా ఉండదని కోవూరు ట్రాన్స్‌కో డీఈ సతీష్ పేర్కొన్నారు. కోవూరు ట్రాన్స్‌కో సబ్ డివిజన్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఆడుదాం.. ఆంధ్రా'తో క్రీడాకారులకు ప్రోత్సాహం



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

• ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రూ.వంద కోట్లు వెచ్చించి ఆడుదాం.. ఆంధ్రా క్రీడా సంబరాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నార్త్‌రాజుపాళెం హైస్కూల్లో ఆడుదాం.. ఆంధ్రా పోటీలను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. క్రీడా పోటీలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీయాలనే ఉద్దేశంతో క్రీడా సంబరాలను సీఎం ప్రవేశపెట్టారని తెలిపారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కళ్లద్దాలు మంజూరైన వంద మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఎంఈఓలు వసంతకుమారి, అంకయ్య, వైద్యాధికారి రామకృష్ణ, ఈఓపీఆర్డీ డేవిడ్, సర్పంచ్ సుప్రియ, ఎంపీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు జాలయ్య, రాధాకృష్ణ, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రయోగశాలను సద్వినియోగం చేసుకోండి



కోవూరు: ధాన్యంలో తేమ శాతం తదితరాలను పరిశీలించేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన ప్రయోగశాలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సత్యవాణి పేర్కొన్నారు. పట్టణంలోని ఆస్పత్రి సమీపంలో ఏర్పాటు చేసిన ప్రయోగశాలను ట్రైనీ కలెక్టర్ సంజనా సిన్హా బుధవారం పరిశీలించారు. ప్రయోగశాలలో సేవలను ఉచితంగా అందజేస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తెలిపారు. సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, వ్యవసాయాధికారి శైలజకుమారి తదితరులు పాల్గొన్నారు.

డిజాంగో ఫ్రేమ్ వర్క్‌తో ఉద్యోగావకాశాలు



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్

కొడవలూరు: ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్‌లోని డిజాంగో ఫ్రేమ్ వర్క్‌లో నైపుణ్యాన్ని పెంచుకోవడం ద్వారా ఉద్యోగావకాశాలు మెండుగా లభిస్తాయని మల్లారెడ్డి విశ్వవిద్యాలయ సీఎస్‌ఈ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ పేర్కొన్నారు. డిజాంగో ఫ్రేమ్ వర్క్‌పై నార్త్‌రాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్‌ఈ, ఎంసీఏ విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ అనిల్‌కుమార్, సీఎస్‌ఈ, ఎంసీఏ విభాగాధిపతులు నాగేంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కుష్టు వ్యాధిపై మండలంలోని దామరమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా పారా మెడికల్ అధికారి మోహన్‌రావు మాట్లాడారు. ఆరోగ్యంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని కోరారు. శరీరంపై మచ్చలు ఉండి.. స్పర్శ లేకపోతే కుష్టువ్యాధిగా అనుమానించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: కుష్టు వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని జగదేవిపేట వైద్యాధికారి కిషోర్ పేర్కొన్నారు. జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలోని ఎనిమిది సచివాలయాల్లో 26 టీముల ద్వారా వైద్య బృందాలు ఇంటింటినీ సందర్శించి కుష్టు సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 432 గృహాలను సందర్శించి 1847 మందిని పరిశీలించామని చెప్పారు. 15 రోజుల పాటు కార్యక్రమం కొనసాగనుందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెచ్‌ఈఓ శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమా, సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన నేతలు



కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీలో నియమితులైన పలువురు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డీఎల్డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, పడుగుపాడు ఉప సర్పంచ్ అహ్మద్, జలజీవన్ మిషన్ చైర్మన్ గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బొర్రా సంతోష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. మండల యూత్ అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలను తెలియజేశారు.

సచివాలయ భవన పరిశీలన

ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్ భవనాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూడు భవనాల నిర్మాణం పూర్తయిందని, వీటికి సిమెంట్ రోడ్డు, ప్రహరీ అవసరం ఉందని స్థానిక నేతలు చెప్పారన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. నేతలు గూడూరు ప్రభాకర్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, సురేంద్ర, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

కౌన్సిల్ అత్యవసర సమావేశం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడారు. అత్యవసర సమావేశంలో రెండు అజెండాలను ప్రవేశపెట్టామని చెప్పారు. ఒకటో చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితమ్మ, రెండో వైస్ చైర్మన్ షాహుల్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారని, వీటికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయికి పూజలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలో వెలసిన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి ప్రత్యేక పూజలను బుధవారం నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవారికి విశేషాభిషేకాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలను స్వీకరించారు.

విశేషాలంకారంలో విశ్వనాథుడు

మనుబోలు: చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపంలోని విశ్వనాథస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలను బుధవారం నిర్వహించారు. మార్గశిర మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకొని విశ్వనాథుడికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచామృతాభిషేకంతో పాటు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను అర్చకుడు శ్రీనివాసులు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

నెల్లూరు(క్రైమ్): బాలికలు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహనను పెంపొందించుకోవాలని దిశ ఇన్‌స్పెక్టర్ రామారావు సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, మానవ అక్రమరవాణా, పోక్సో, దిశ యాప్, మహిళల రక్షణ చట్టాలు తదితరాలపై నవాబుపేటలోని బీవీఎస్ గర్ల్స్ హైస్కూల్లో విద్యార్థినులకు అవగాహన సదస్సును జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా.. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా డయల్ 100కు కాల్ చేస్తే రక్షణ కల్పించడంతో పాటు నిందితులపై చర్యలు చేపడతామని చెప్పారు. సాధ్యమైనంత వరకు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం దిశ యాప్ పనితీరును వివరించి.. ఆపద సమయాల్లో యాప్ సేవలను ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు. యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు విజయజ్యోతి, ఏహెచ్‌టీయూ సిబ్బంది సతీష్, శ్రీహరి, ప్రసాద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఉచిత వైద్య పరీక్షలు

నెల్లూరు (లీగల్): నగరంలోని బార్ అసోసియేషన్ హాల్లో న్యాయవాదులకు ఉచిత హోమియో మెడికల్ క్యాంప్‌ను హోమియో వైద్యుడు ఏపూరి చక్రధర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అనంతరం మందులను అందజేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వర్, సుందరయ్య యాదవ్, ట్రెజరర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు పేర్కొన్నారు. స్టోన్‌హౌస్‌పేటలోని డీసీఎమ్మెస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. డీసీఎమ్మెస్ ద్వారా రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డీసీఎమ్మెస్‌లో ఉద్యోగుల పదవీ కాలాన్ని 58 నుంచి 60 ఏళ్లకు పెంచడం, ధాన్యం విక్రయాలు చేసిన రైతులకు హమాలీ, రవాణా చార్జీలను ఈ నెలాఖరులోపు చెల్లించడం, సంక్రాంతి నాటికి డీసీఎమ్మెస్ కార్యాలయంలో జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభించనున్నామని వెల్లడించారు. ఉద్యోగ విరమణ పొందిన డీసీఎమ్మెస్ ఉద్యోగులకు రావాల్సిన అన్ని సౌకర్యాలను త్వరలో అందజేయడం.. నూతనంగా నియమితులైన ఉద్యోగులకు ఈపీఎఫ్‌ను అమలు చేయడం.. ఎరువుల కుంభకోణంలో బాధ్యులపై చేపట్టాల్సిన చర్యలపై పాలక మండలిలో తీర్మానాలు చేశారు. పాలకమండలి సభ్యులు రంగనాథం, ఖిల్జీ సలీమ్, సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, బిజినెస్ మేనేజర్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం' అర్జీలపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి.. అందినవి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం అర్జీల పురోగతి, ఆడుదాం.. ఆంధ్రా పోటీల నిర్వహణపై అధికారులతో వెబెక్స్ ద్వారా తన క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీలే మళ్లీ వస్తున్నాయని, ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని.. ఒక వేళ పరిష్కారం కాకపోతే కారణాలను అర్జీదారులకు అర్థమయ్యేలా వివరించాలని చెప్పారు. ప్రజల నుంచి విజ్ఞప్తులు వచ్చినప్పుడు సకాలంలో విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలన్నారు.

షెడ్యూల్ ప్రకారం ఆడుదాం.. ఆంధ్రా పోటీలు

ఆడుదాం.. ఆంధ్రా పోటీలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. రోజూ సాయంత్రం ఆరు గంటల్లోపు నివేదికలను పంపాలని సూచించారు. క్రీడాకారులకు ఇబ్బందుల్లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని, పిల్లలకు భోజనం అందేలా చూడాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలకు ఇబ్బంది లేకుండా బాలామృతాన్ని అందించాలని కోరారు. జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్, జెడ్పీ సీఈఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

మూలస్థానేశ్వరుడికి మహా అన్నాభిషేకం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహా అన్నాభిషేకాన్ని బుధవారం నిర్వహించారు. స్వామివారి జన్మనక్షత్రం ఆరుద్రను పురస్కరించుకొని శివకామసుందరి, నటరాజస్వామికి విశేషాభిషేకాలు, ద్వార దర్శనం తదితరాలను జరిపారు.